ప్రభుత్వ వైద్యానికి మహర్దశ

నెల్లూరు– ప్రకాశం జిల్లాల సరిహద్దులో కావలి, ఉదయగిరి, కందుకూరు నియోజకవర్గాల ప్రజలకే కాకుండా, జాతీయ రహదారి ప్రమాద బాధితులకు అత్యంత కీలకంగా ఉన్న కావలి ప్రభుత్వ ఏరియా వైద్యశాలకు మహర్దశ పట్టింది. ఆరు దశాబ్దాలుగా ఎంతో మందికి ప్రాణదాతగా నిలిచిన వైద్యశాల గత ప్రభుత్వం నిర్లక్ష్యానికి గురైంది. తొలి విడతలో ఆధునిక వసతులతో భవనాలు నిర్మిస్తున్నారు. ఇప్పటికే పూర్తికాగా, ఇంటీరియర్ పనులు కొనసాగుతున్నాయి. భవనాలు పూర్తయితే కార్పొరేట్ వైద్య సేవలు అందించేందుకు వీలుగా అత్యాధునిక మెడికల్ ఎక్విప్‌మెంట్ ఏర్పాటుకు సన్నాహాలు జరుగుతున్నాయి.

- రూ.20 కోట్లతో కావలి ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో ఆధునిక వసతులతో భవనాలు
- రెండో విడతలతో అత్యాధునిక మెడికల్ ఎక్విప్‌మెంట్ ఏర్పాటుకు సన్నాహాలు



కావ ఏరియా వైద్యశాలలో నూతనంగా ఆధునిక సౌకర్యాలతో నిర్మించిన భవనాల సముదాయం

కావలి: సుమారు 60 ఏళ్ల క్రితం పరిసర ప్రాంతాల్లో ఉన్న జనాభా సంఖ్యను ప్రాతిపదికను చేసుకుని ఉమ్మడి జిల్లాలో రెండో అతిపెద్ద వైద్యశాలగా కావలి ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిని నిర్మించారు. అప్పట్లో జాతీయ రహదారిగా ఉన్న ట్రంకు రోడ్డు పక్కనే వైద్యశాలను ఏర్పాటు చేశారు. రోజూ కనీసం 500 మందికి తక్కువ కాకుండా గరిష్ఠంగా 1,000 మందికి పేదలకు ఉచితంగా ఆరోగ్య సేవలు అందిస్తోంది. అప్పట్లో కావలి పట్టణంలో ప్రైవేట్ ఆస్పత్రులు లేకపోవడంతో పట్టణంతో పాటు, చుట్టు పక్కల ఉన్న వందలాది గ్రామాల ప్రజలకు వైద్య సేవలు అందించడంలో కావలి ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి కీలకంగా ఉండింది. పెరిగిన జనాభాకు తగిన విధంగా భవన వసతులు లేకపోవడంతో ఇరుకుగా ఉండటంతో 1995లో ఆస్పత్రికి కొత్త భవనాలను నిర్మించి కొంత విస్తరణ చేశారు. అయితే పట్టణంలో ప్రైవేట్ వైద్యశాలలు పుట్టగొడుల్లా పుడుతుండడంతో కావలి ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి ప్రాధాన్యత కూడా తగ్గుతూ వచ్చింది. అప్పటి ప్రభుత్వాలు కూడా ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్య సేవలను నాణ్యతతో అందించే విషయానికి ప్రాధాన్యత ఇవ్వకపోవడంతో కావలి ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో వైద్యంపై కూడా ప్రజల్లో ఆసక్తి సన్నగిల్లింది. కావలి ఏరియా వైద్యశాలను నిపుణుల వైద్యుల కొరతతో పాటు మందులు, మెరుగైన వైద్యం సేవలు అందించే వసతులు లేకపోవడంతో పాటు గతంలో ఏర్పాటు చేసిన ఎక్స్‌రే, ఈసీజీ మెషిన్లు మూలనపడ్డాయి. కనీసం బ్లడ్ టెస్ట్‌లు కూడా చేయడానికి వీలుగా కిట్‌లు కూడా అందుబాటులో లేని పరిస్థితి నెలకొంది. చుట్టు పక్కల గ్రామాల ప్రజల సంఖ్య వేల నుంచి లక్షల సంఖ్యకు చేరోవడంతో కావలి ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి ఇరుకు అయిపోయింది.

వైద్యానికి పెద్ద పీట

2019లో ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వైద్యానికి అత్యంత ప్రాధాన్యత ఇచ్చారు. ప్రత్యేకించి కరోనా విపత్తు సమయంలో కావలి ఏరియా వైద్యశాలలో కొన్ని అత్యవసరమైన మెడికల్ ఎక్విప్‌మెంట్‌ను ఏర్పాటు చేయించారు. ప్రభుత్వ వైద్యసేవల్లో నాణ్యత పెరగడంతో పాటు వసతులు గణనీయంగా పెంపొందించేందుకు పటిష్టమైన కార్యాచరణ రూపొందించి అమలు చేస్తోంది. ఆస్పత్రిలో వైద్య సేవల్లో నాణ్యత పెరగడంతో రోగులు పెద్ద సంఖ్యలో రాసాగారు. దీంతో ఆస్పత్రి ప్రాంగణంలో వైద్యులు, నర్సుల వైద్య సేవలు అందించడానికి అనేక అవస్థలు పడే పరిస్థితి నెలకొంది. ఇక రోగులు బాధలు వర్ణనాతీతంగా తయారైంది. ఇవన్నీ పరిగణంలోకి తీసుకున్న ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి ప్రభుత్వం దృష్టికి సమస్య తీవ్రతను తీసుకెళ్లారు. కావలి ఏరియా వైద్యశాలను అత్యాధునిక వసతులతో కార్పొరేట్ వైద్యశాలగా తీర్చిదిద్దాలనే సంకల్పంతో కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి నిధులు మంజూరు కోసం వైద్యారోగ్యశాఖ మంత్రితో పాటు ముఖ్యమంత్రిని కలిసి విన్నవిచ్చారు. నెల్లూరు–ప్రకాశం జిల్లాల సరిహద్దుల్లో జాతీయ రహదారికి పక్కనే కీలకంగా ఉన్న కావలి ఏరియా వైద్యశాల ప్రాధాన్యతను వివరించారు. కావలికి ఉత్తరాన రామాయపట్నం, తూర్పున జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్ నిర్మితం అవుతున్న నేపథ్యంలో కావలి ఏరియా వైద్యశాల అభివృద్ధి ఆవశ్యకతను వివరించారు. ప్రభుత్వం కూడా ప్రభుత్వ ఆస్పత్రుల్లో వసతులు పెంచడానికి చర్యలు తీసుకొంటుండంతో ఎమ్మెల్యే ప్రతిపాదనలను ఆమోదించింది. వైద్యులకు, నర్సులకు, పరీక్షలు చేసే థియేటర్లు, ల్యాబ్‌లకు, ఇతర అవసరాలకు, రోగులకు, రోగుల సహాయకులకు అవసరమైన వసతులతో కూడిన భవనాలు నిర్మించడానికి రూ.20 కోట్లు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మంజూరు చేశారు. వాటి నిర్మాణాలు చివరి దశకు చేరుకున్నాయి.

త్వరలోనే ఆధునిక భవనాలు ప్రారంభం



వచ్చే నెలలో ఆస్పత్రి నూతన భవనాలు ప్రారంభించడానికి రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజినీని ఆహ్వానించాం. ప్రస్తుతం పనులు శరవేగంగా జరుగుతున్నాయి. భవన నిర్మాణాలు అయిపోయాయి. కేవలం ఇంటీరియర్ పనులు మాత్రమే జరుగుతున్నాయి. అధునాతన వసతులతో గదులు, హాలులు నిర్మాణాలు జరిగాయి. త్వరలోనే ఆధునిక భవనాల్లో మెరుగైన వైద్య సేవలు అందించేందుకు వీలుగా అధునాతన మెడికల్ ఎక్విప్‌మెంట్‌ను ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నాను.

– రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే, కావలి



చివరి దశలో ఉన్న మరో భవనం



నిర్మాణంలో ఉన్న భవనం

క్లుప్తంగా

ఓపెన్ డిగ్రీలో చేరేందుకు గడువు పొడిగింపు

ఆత్మకూరు: బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ డిగ్రీ మొదటి సంవత్సరం చదివేందుకు దరఖాస్తుల గడువు అక్టోబరు 20వ తేదీ వరకు పొడిగించినట్లు ఆత్మకూరులోని ఎస్ఆర్‌జేడీ కళాశాల ఓపెన్ యూనివర్సిటీ కేంద్రం కో–ఆర్డినేటర్ జి.శ్రీకాంత్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఓపెన్ డిగ్రీలో చేరేందుకు నేరుగా అనుమతులు ఉన్నాయని, ఇంటర్మీయడిట్, ఐటీఐ, ఓపెన్ ఇంటర్మీడియట్, ఒకేషనల్ కోర్సులు పూర్తిచేసిన వారు ఓపెన్ డిగ్రీలో చేరేందుకు అర్హులని ప్రకటనలో వివరించారు. వివరాల కోసం 73829 29793 నంబరులో సంప్రదించాలన్నారు.

పోలేరమ్మకు ప్రత్యేక పూజలు



మహిమలూరు పోలేరమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న పెద్దకాపు పద్మారెడ్డి

ఆత్మకూరురూరల్: మండలంలోని మహిమలూరులో కొలువై ఉన్న పోలేరమ్మ అమ్మ వారికి భక్తులు ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవి నవరాత్రులు 21 రోజులు ముందుగా మహిమలూరు మహిళా భక్తులు అమ్మ వారికి చద్దితో నిత్య నైవేద్యాలు సమర్పించడం ఆనవాయితీగా ఉంది. ఈ నేపథ్యంలో ఆదివారం భక్తులు అధిక సంఖ్యలో హాజరై అమ్మ వారికి నైవేద్యాలు సమర్పించారు. పెద్ద కాపు, ఆలయ పూజారి మెట్టుకూరు పద్మారెడ్డి, ఆలయంలో పూజలు నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

పోలేరమ్మకు పొంగళ్లు



నరసారెడ్డిపాళెంలో ఊరేగింపుగా వెళుతున్న మహిళలు

కలిగిరి: కృష్ణారెడ్డిపాళెం పంచాయతీ నరసారెడ్డిపాళెంలో గ్రామదేవత పోలేరమ్మ తల్లికి ఆదివారం మహిళలు భక్తిశ్రద్ధలతో పొంగళ్లు పెట్టి మొక్కులు తీర్చుకున్నారు. ఊరేగింపుగా మహిళలు పోలేరమ్మ తల్లి ఆలయం వద్దకు చేకురున్నారు. ఆలయ ప్రాంగణంలో సామూహికంగా పొంగళ్లు పెట్టారు. అమ్మవారికి పొంగళ్లను నైవేద్యంగా సమర్పించారు. వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు బాగా పండాలని, గ్రామానికి ఎలాంటి కీడు జరగకుండా చూడాలని మొక్కుకున్నారు.

జలదంకి, బ్రాహ్మణక్రాకలో..

జలదంకి: మండలంలోని బ్రాహ్మణక్రాక, జలదంకి, చామదల గ్రామాల్లో ఆదివారం పోలేరమ్మకు పొంగళ్లు పెట్టారు. అమ్మవారిని పసుపు, కుంకుమలతో ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు చేపట్టారు. తమ కుటుంబాల్లో పాడి పంటలు వృద్ధి చెందాలని వేడుకున్నారు. ఆలయాల వద్ద అన్నదాన కార్యక్రమాలు జరిగాయి.

మాతమ్మతల్లికి పొంగళ్లు



మాతమ్మ తల్లికి ఊరేగింపుగా పట్టు వస్త్రాలు తీసుకెళ్తున్న చిరంజీవిరెడ్డి దంపతులు

కలిగిరి: అనంతపురం గ్రామ దేవత మాతమ్మ తల్లికి ఏపీ స్టేట్ పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టుకూరు చిరంజీవిరెడ్డి, ఎంపీపీ శిరీష దంపతులు ఆదివారం పొంగళ్లు పెట్టారు. అమ్మ వారికి పట్టువస్త్రాలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులతో పాటు మండలంలోని పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

రాజారెడ్డి పరామర్శ



వెంకటాద్రి కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న రాజారెడ్డి

ఉదయగిరి: మండలంలోని దుర్గంపల్లికి చెందిన బకీరు వెంకటాద్రి కుటుంబ సభ్యులను ఉదయగిరి నియోజవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వకర్త మేకపాటి రాజారెడ్డి ఆదివారం పరామర్శించారు. వెంకటాద్రి శనివారం రాత్రి మృతి చెందడంతో ఆయన మృతదేహానికి నివాళి అర్పించారు. ఆయన వెంట వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు ఓబులరెడ్డి తదితరులు ఉన్నారు.

ఎమ్మెల్యే సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరిక



ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి సమక్షంలో పార్టీలో చేరుతున్న టీడీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు సమాధి శ్రీనివాసులు

బిట్రగుంట: బోగోలు టీడీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు సమాధి శ్రీనివాసులు ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్ కుమార్‌రెడ్డి సమక్షంలో ఆదివారం వైఎస్సార్‌సీపీలో చేరారు. బోగోలులో నిర్వహించిన 'వై ఏపీ నీడ్స్ వైఎస్ జగన్' కార్యక్రమం సందర్భంగా పార్టీ మండల అధ్యక్షుడు మద్దిబోయిన వీరరఘు ఆధ్వర్యంలో పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ఆలయాల పునరుద్ధరణ హర్షణీయం

ఆత్మకూరు: ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి చొరవతో నియోజకవర్గం పరిధిలో 54 ఆలయాల పునర్నిర్మాణం, నూతన ఆలయాల ఏర్పాటుకు నిధులు మంజూరు కావడం హర్షనీయమని పార్టీ పట్టణ అధ్యక్షుడు అల్లారెడ్డి ఆనంద్‌రెడ్డి అన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ గతంలో ఏ ఎమ్మెల్యే చేయని విధంగా ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి గత రెండు నెలల క్రితం దేవదాయశాఖ మంత్రి కొట్టు సత్యనారాయణను విజయవాడలో కలిసి విన్నవించడంతో నిధులు మంజూరు చేశారన్నారు. జిల్లాలో 98 ఆలయాల నిర్మాణాలకు విన్నపాలు అందితే అత్యధికంగా ఆత్మకూరు నియోజకవర్గంలో 54 ఆలయాల నిర్మాణ పనులకు నిధులు మంజూరు చేయడం గొప్ప విషయమని, కేవలం ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి చొరవతోనే ఇది సాధ్యమైందన్నారు. ఆత్మకూరు మున్సిపల్ పరిధిలో చెరువు దగ్గర గంగమ్మ ఆలయంతో పాటు నరసాపురం, శాంతినగరం, ముస్తాపురంలో మూడు రామాలయాలు పునరుద్దరణకు నిధులు మంజూరయ్యాయన్నారు. నువ్వూరుపాడు, కరటంపాడు మజరా శ్రీనివాసపురం, మురగళ్ల, వాశిలి, బట్టేపాడు, రావులకొల్లు, బంట్లపల్లి, అప్పారావుపాళెం గ్రామాల్లో పలు రామాలయాలు, హనుమాన్ ఆలయాల పునరుద్దరణకు రూ.1.19 కోట్ల నిధులు మంజూరయ్యాయని వివరించారు.

15 ఏళ్లుగా ఈ కారు ఇక్కడే..!



డీసీపల్లి పొగాకు వేలం కేంద్రం సమీపంలో రోడ్డు పక్కనే ఉన్న కారు

ఆత్మకూరురూరల్ (మర్రిపాడు): మర్రిపాడు మండలం డీసీపల్లి పొగాకు వేలం కేంద్రం సమీపంలో 67వ నంబరు జాతీయ రహదారి పక్కనే ఓ కారు 15 ఏళ్లుగా ముళ్ల పొదల్లో ఎవరికి కనిపించకుండా ఉండిపోయింది. ఇటీవల ఆ ప్రాంతంలో ముళ్ల తుప్పలు తొలగించడంతో ఆ కారు మరోసారి వెలుగు చూడడంతో చర్చనీయాంశంగా మారింది. స్థానికంగా ఉన్న కొందరు చెబుతున్న సమాచారాన్ని బట్టి అప్పట్లో రాయలసీమకు చెందిన ఒక నాయకుడి అనుచరుడు ఎర్రచందనం తరలిస్తుండగా ఈ కారు ఓ గేదెను ఢీకొట్టి ప్రమాదానికి గురైంది. కారుకు ముందు, వెనుక వేర్వేరు నంబరు ప్లేట్లు ఉండగా, వాహనం నడుపుతున్న వ్యక్తి అప్పటికప్పుడే ఆ రెండు నంబరు ప్లేట్లను తీసుకుని ఉడాయించినట్లు చెబుతున్నారు. ఆ తర్వాత కాలంలో రోడ్డు పక్కన నిలిపిన కారు చుట్టూ ముళ్ల పొదలు పెరిగిపోవడంతో ఈ విషయమై ఎవరూ దృష్టి సారించిన దాఖలాలులేవు. సాధారణంగా ప్రమాదాలకు గురైన వాహనాలను సంబంధిత పోలీసులు స్వాధీనం చేసుకోవడమో, అవసరమైతే కోర్టుకు స్వాధీనం చేయడం జరుగుతోంది. ఇలాంటివేమి లేకుండానే ఈ కారు ఇక్కడ ఉండడం పలు ప్రశ్నలకు తావిస్తోంది. కానీ ఈ కారును అప్పటి నుంచి ఇలా ఎందుకు వదిలేశారో ఇప్పటికీ అర్థం కాని ప్రశ్నగా మిగిలిపోయింది. 15 ఏళ్లలో కారు టైర్లు, టేప్ రికార్డర్, బ్యాటరీ తదితర ఇతర విడి భాగాలు చోరీకి గురైనట్లు ప్రస్తుత పరిస్థితి బట్టి తెలుస్తోంది. ఇటీవల ఆ ప్రాంతంలో ఉన్న కంప చెట్లను తొలగించడంతో శిథిలావస్థకు చేరిన ఆ కారు జాతీయ రహదారిపై రాకపోకలు సాగించే వారికి కొత్తగా కనిపిస్తోంది. దీంతో ఈ కారు గురించి కథలు కథలుగా చెప్పుకుంటున్నారు. రవాణా, పోలీసుశాఖ అధికారులు స్పందించి పాత రికార్డులు తిరగేస్తే ఈ కారు వెనుక మిస్టరీ వెలుగులోకి వచ్చే అవకాశం ఉందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.

పారిశుద్ధ్యంపై స్పెషల్ డ్రైవ్

పొదలకూరు : మేజర్ పంచాయతీ పొదలకూరులో వార్డుల వారీగా రెండు మాసాల పాటు పారిశుద్ధ్యంపై స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తామని పంచాయతీ ఉపసర్పంచ్ వాకాటి శ్రీనివాసులురెడ్డి తెలిపారు. ముందుగా ఆదివారం ఒకటో వార్డులో సభ్యుడు ఎస్కే అంజాద్‌తో కలిసి పారిశుద్ధ్య పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి ఆదేశాల మేరకు స్పెషల్ డ్రైవ్ పనులను చేపడుతున్నట్లు తెలిపారు. దోమల ఉధృతి పెరగకుండా వీధుల్లో మురుగు కాలువలను శుభ్రం చేయించి బ్లీచింగ్ చల్లిస్తామన్నారు. చుట్టుపక్కల ఉన్న పిచ్చిమొక్కలను తొలగించడంతో పాటు ఫాగింగ్ చేయించడం వల్ల చాలావరకు దోమల ఉధృతి తగ్గుతుందన్నారు. ఎక్కడా తాగునీటి సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకుంటామని, వీధిలైట్లు వెలగకుంటే ఆయా ప్రాంతాల వారు సమాచారం అందిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. పారిశుద్ధ్య పనులకు పంచాయతీ ప్రజలు సహకరించాల్సిందిగా విజ్ఞప్తి చేశారు.

నేటి నుంచి గంధ మహోత్సవం

చేజర్ల (సోమశిల): అనంతసాగరంలోని ప్రముఖ పుణ్యక్షేత్రం హజరత్ సయ్యద్ షా మష్ కూర్ దర్గాలో ఈ నెల 9 నుంచి 11వ తేదీ వరకు గంధ మహోత్సవం జరుగుతుందని దర్గా పీఠాధిపతి హజరత్ సయ్యద్ షా సాహెబ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 9వ తేదీ రాత్రి 7 గంటలకు ఘనంగా గంధ మహోత్సవం ప్రారంభమవుతోందన్నారు.

రక్తదాన శిబిరం



రక్తదాన శిబిరం

వింజమూరు(ఉదయగిరి): స్థానిక వివేకానంద జూనియర్ కాలేజీ ఆవరణలో ఆదివారం వింజమూరు రెడ్‌క్రాస్ యూనిట్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం జరిగింది. 83 మంది దాతలు రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో రెడ్‌క్రాస్ వింజమూరు యూనిట్ బాధ్యులు ఎం.గోపాల్ రెడ్డి, కేవీ రత్నం, టి.కృష్ణారెడ్డి, హాజరత్, నరేష్ చంద్ర, శివకోటారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మెట్ట ప్రాంతాల యువతకు ఉపాధి కల్పించాలి



పాదయాత్రలో పాల్గొన్న సీపీఎం నాయకులు

చేజర్ల(సోమశిల): మెట్ట ప్రాంతాలైన అనంతసాగరం, మర్రిపాడు మండలాల్లో పరిశ్రమలు పెట్టి యువతకు ఉపాధి కల్పించాలని సీపీఎం నాయకులు కోరారు. సీపీఎం తలపెట్టిన జిల్లా సమగ్ర అభివృద్ధి పాదయాత్ర ఆదివారం అనంతసాగరం మండలం లింగంగుంట, పాతదేవరాయపల్లి, ముత్తుకూరు, కొత్తపల్లి, మినగల్లు, రేవూరు, శంకరనగరం గ్రామాల మీదుగా ఆత్మకూరు మండలం దేపూరులోకి ప్రవేశించింది. ఈ సందర్భంగా ఆ పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు కటారి అజయ్‌కుమార్ మాట్లాడుతూ జిల్లాకే పేరు తలమానికం అయిన సోమశిల జలాశయం అనంతసాగరం మండలంలోనే ఉన్నా.. కరువు మండలంగా మిగిలిపోయిందన్నారు. ఆత్మకూరు, ఉదయగిరి నియోజక వర్గంలో పరిశ్రమలు తీసుకొచ్చి యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా కార్యదర్శి మూలి వెంకయ్య, నాయకులు మంగల పుల్లయ్య, గంట లక్ష్మీపతి, నరసింహ, అనంతసాగరం సీపీఎం కార్యదర్శి అన్వర్ బాషా, సుబ్బరాయుడు, వేము పెంచలయ్య, ఉప్పలపాటి మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

బుచ్చి ఉపాధ్యాయుడికి పురస్కారం

బుచ్చిరెడ్డిపాళెం రూరల్ : బుచ్చిరెడ్డిపాళెంలోని రామచంద్రాపురం ప్రాథమికోన్నత పాఠశాల ఉపాధ్యాయుడు, జిల్లా రిసోర్స్ గ్రూపు సభ్యుడు గండికోట సుధీర్‌కుమార్ ఒంగోలులోని క్విస్ ఇంజినీరింగ్ కాలేజీలో ప్రపంచ ఉపాధ్యాయ దినోత్సవంలో భాగంగా ఆదివారం ఎక్సలెన్సీ పురస్కారం అందుకున్నారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ విద్యాబోధనలో సుధీర్‌కుమార్ వినూత్నమైన విధానాలను అనుసరిస్తూ ఆటపాటల ద్వారా విద్యను అందించడంలో ప్రత్యేక గుర్తింపు సాధించారని ప్రశంసించారు.

మున్సిపల్ మాజీ చైర్మన్‌కు ఎమ్మెల్యే నివాళులు



మల్లెల ఉదయభాస్కర్ (ఫైల్).



మల్లెల ఉదయభాస్కర్ భౌతికకాయానికి పూల మాల వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి

కావలి: కావలి మున్సిపల్ మాజీ చైర్మన్ మల్లెల ఉదయభాస్కర్ (70) ఆరోగ్య సమస్యలతో మరణించడంతో స్థానిక కో–ఆపరేటివ్ కాలనీలోని ఆయన నివాసానికి ఆదివారం వెళ్లి భౌతికకాయానికి పూల మాల వేసి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి నివాళులర్పించారు. 1983–84 మధ్య కాలంలో కావలి మున్సిపల్ చైర్మన్‌గా పని చేసిన మల్లెల ఉదయభాస్కర్ సౌమ్యుడిగా ఆ రోజుల్లో అందరి అభిమానాలు పొందారని ఎమ్మెల్యే గుర్తు చేశారు. రాజకీయాల్లో ఆసక్తి లేకపోవడంతో చైర్మన్ పదవి నుంచి తప్పుకున్నాక ప్రభుత్వ ఉద్యోగిగా చేరారని చెప్పారు. వ్యక్తిగతంగా తనతో కూడా సన్నిహితంగా ఉండే మల్లెల ఉదయభాస్కర్ ఉద్యోగంలో చేరిన తర్వాత చీరాల, బాపట్ల తదితర ప్రాంతాల్లోనే ఉండిపోయారని ఎమ్మెల్యే చెప్పారు. మంచి మిత్రుడు కోల్పోవడం బాధాకరమని ఎమ్మెల్యే అన్నారు. మల్లెల ఉదయ భాస్కర్ కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సంతాపాన్ని తెలియజేశారు. వైఎస్సార్‌సీపీ నాయకులు కేతిరెడ్డి శివకుమార్‌రెడ్డి, కనమర్లపూడి వెంకట నారాయణ, గంధం ప్రసన్నాంజనేయులు తదితరులు మల్లెల ఉదయభాస్కర్ భౌతికకాయానికి నివాళులర్పించారు.

ఏజీఎఫ్ అథ్లెటిక్స్‌లో ఆదర్శ కళాశాల విద్యార్థుల సత్తా



ఏజీఎఫ్ అథ్లెటిక్స్‌లో సత్తా చాటిన నాగమణి, లీలావతి, సహన

కొండాపురం: ఏజీఎఫ్ అథ్లెటిక్స్ క్రీడల ఎంపికలో కొండాపురం ఆదర్శ కళాశాల విద్యార్థులు సత్తా చాటినట్లు కళాశాల ప్రిన్సిపల్ ఖాదర్‌బాషా ఆదివారం తెలిపారు. కళాశాలలో ఇంటర్ ప్రథమ సంవత్సరం చదువుతున్న నాగమణి, లీలావతి, సహన, భానుప్రకాష్ ఐదు విభాగాల్లో ప్రతిభ కనబరిచారన్నారు. జిల్లా స్థాయి పోటీల్లో లాంగ్ జంప్, ట్రిపుల్ జంప్, షార్ట్‌పుట్‌లో ప్రథమ స్థానం, 100 మీటర్ల పరుగు పందెంలో ప్రథమ, 200 మీటర్ల పరుగు పందెంలో ద్వితీయ స్థానం సాధించి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారని పేర్కొన్నారు. దీంతో కళాశాల ప్రిన్సిపల్ ఖాదర్ బాషా, పీఈటీ శ్రీనివాసులు, ఉపాధ్యాయులు విద్యార్థులను అభినందించారు.

భూసమస్యలకు శాశ్వత పరిష్కారం

- ఆర్డీఓ కరుణకుమారి



భూ హద్దులు పరిశీలిస్తున్న ఆర్డీఓ కరుణకుమారి

అనుమసముద్రంపేట: జగనన్న శాశ్వత భూ హక్కు భూరక్ష సర్వే ద్వారా రైతులకు సంబంధించి సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని ఆత్మకూరు ఆర్డీఓ ఎస్.కరుణకుమారి అన్నారు. ఆదివారం మండలంలోని పందిపాడులో జగనన్న భూ హక్కు భూ రక్ష సర్వేను ఆమె తనిఖీ చేశారు. ఆమె మాట్లాడుతూ ఈ రీసర్వే ప్రవేశ పెట్టడం వల్ల ఎంతో మంది రైతులు తమ భూ రికార్డులను కచ్చితంగా తెలుసుకుంటున్నారన్నారు. రైతుల భూమి హద్దులు తెలియక ఇప్పటి వరకు ఇబ్బందులు పడుతున్నారని, ఈ సర్వే వల్ల రైతులకు హద్దులు సైతం తెలుసుకునేందుకు సునాయాసంగా ఉంటుందని తెలిపారు. రైతులు ఇక నుంచి భూ సమస్యల కోసం కార్యాలయాల చుట్టూ తిరగకుండా ఉండేందుకు డిజిటలైజేషన్‌లో నమోదు చేసి సచివాలయాల్లోనే కచ్చితమైన పరిష్కారం రైతులకు చూపనున్నట్లు ఆమె తెలిపారు. భూ రీసర్వే వల్ల రైతులకు ఎటువంటి నష్టం జరగదని, రైతులు సైతం రెవెన్యూ అధికారులకు సహకరించాలని ఆమె కోరారు. ఆమె వెంట జిల్లా సర్వే ఏడీ ఏ ప్రసాద్, డీఐ శేషగిరిరావు, ఏఎస్‌పేట సర్వేయర్ అజీజ్, గ్రామ సర్పంచ్ అల్లం పాటి కొండారెడ్డి, వీఆర్‌ఓ హజరత్తయ్య, సచివాలయ సర్వేయర్లు కిరణ్, వంకర్, సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

పాముల కలకలం



ఆటోనగర్ వద్ద బైక్‌లో దూరిన పామును చూస్తున్న స్థానికులు

- రెండు వేర్వేరు ఘటనల్లో బైక్‌ల్లో దూరిన పాములు



బైక్‌లో దూరిన పామును చంపిన దృశ్యం

ఆత్మకూరు: పట్టణంలోని హిల్‌రోడ్డు ఆటోనగర్, కూరగాయల మార్కెట్ వద్ద పార్కింగ్ చేసిన రెండు బైక్‌ల్లో పాములు దూరి కలకలం సృష్టించాయి. ఈ ఘటనలు ఆదివారం జరిగింది. స్థానికుల సమాచారం మేరకు ఆటోనగర్‌లో మెకానిక్ పనులు చేస్తున్న క్రమంలో సమీపంలోని చెట్టుపై నుంచి కిందపడిన ఓ పాము నిలిపి ఉన్న బైక్‌లోకి దూరింది. గమనించిన కొందరు బైక్‌లో నుంచి ఆ పామును బయట తీసేందుకు విశ్వప్రయత్నాలు చేశారు. ఎంత సేపటికి అది వెలుపులకి రాలేదు. దీంతో కొందరు యువకులు సాహసించి బైక్ స్పేర్‌పార్ట్స్‌ను ఒక్కొక్కటిగా విడదీసి శబ్ధాలు చేయడంతో బయటకు వచ్చిన పాము ఎదురుగా ఉన్న దుకాణంలోకి దూరింది. ఓ యువకుడు బయటకు తెచ్చి కొట్టి చంపేశాడు. విషపూరితమైన పాముగా గుర్తించారు. ఈ ఘటనకు కొద్ది సేపు ముందర కూరగాయల మార్కెట్‌లో నిలిపి ఉన్న బైక్‌లోకి ఓ పాము దూరింది. మార్కెట్‌లో పనిచేస్తున్న వారు గమనించి బయటకు తీసి చంపేశారు. ఒకే రోజు ఒకే సమయంలో రెండు పాములు వేర్వేరు ఘటనల్లో బైక్‌ల్లోకి దూరడం పట్టణంలోని చర్చనీయాంశమైంది.